క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి రూ.2 లక్షల ఆర్థిక సాయం

నేలకొండపల్లి: మండలంలోని గువ్వలగూడెంలో నూతనంగా నిర్మిస్తున్న ముత్యాలమ్మ తల్లి దేవాలయం నిర్మాణానికి పాలేరు ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి రూ.2 లక్షల ఆర్థిక సాయం ప్రకటించారు. బుధవారం రైతు సమన్వ సమితి మండల అధ్యక్షుడు శాఖమూరి సతీష్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు బ్రహ్మయ్య చేతుల మీదుగా నగదును కమిటీ ప్రతినిధులకు అందించారు. ఈ కార్యక్రమంలో చెరుకు అభివృద్ధి మండలి చైర్మన్ నెల్లూరి లీలాప్రసాద్, బీఆర్‌ఎస్ నాయకులు వజ్జా శ్రీనివాసరావు, రావెళ్ల జానకిరామయ్య, షేక్ నిజాం అలీ, టి.వెంకటేశ్వర్లు, కమిటీ సభ్యులు వంగూరి వెంకటేశం, బంగారు, నర్సయ్య, బి.వెంకట నారాయణ తదితరులు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలపై అవగాహన సదస్సు

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లా నెహ్రూ యువక కేంద్రం ఆధ్వర్యాన 'నాయకత్వ లక్షణాలు, కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ఫర్ యూత్'పై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు జిల్లా అధికారి సీహెచ్.అన్వేష్ ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని ఎస్‌బీఐటీలో గురువారం నుంచి 25వ తేదీ వరకు ఈ సదస్సు కొనసాగుతుందని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన యువతీ, యువకులు వివరాల కోసం 88978 48806, 7013 105985 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పరిపూర్ణ కమ్యూనిస్టు.. భగత్‌సింగ్


మాట్లాడుతున్న నున్నా నాగేశ్వరరావు

ఖమ్మంమయూరిసెంటర్: భగత్‌సింగ్ గొప్ప దేశభక్తుడే కాకుండా పరిణితి చెందిన కమ్యూనిస్టు అని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు తెలిపారు. స్థానిక సుందరయ్య భవనంలో 'భారత విప్లవ కెరటం భగత్‌సింగ్'పుస్తక సామూహిక పఠనాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రతికూల పరిస్థితుల్లోనూ కమ్యూనిస్టు పార్టీని నిర్మించాలని, నమ్మిన సిద్ధాంతానికి చివరిదాకా కట్టుబడి ఉండాలని భగత్‌సింగ్ చెప్పారని తెలిపారు. డాక్టర్ సి భారవి, నాయకులు పొన్నం వెంకటేశ్వరరావు, యర్రా శ్రీకాంత్, వై విక్రమ్, భండారు రమేష్ పాల్గొన్నారు.

పొంగులేటి పర్యటన


పొంగులేటిని సన్మానిస్తున్న దృశ్యం

ఖమ్మంమయూరిసెంటర్: మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి బుధవారం నగరంలో పర్యటించారు. ఈ సందర్భంగా వినోద మహల్ రోడ్డులో ఉన్న 7డేస్ అకాడమీ స్టడీ హాల్‌ను ప్రారంభించారు. రెడ్డి సంఘం నాయకుడు దగ్గుల మాధవరెడ్డి భార్య ప్రథమ వర్ధంతి కార్యక్రమానికి హాజరై ఆమె చిత్రపటానికి పూలు చల్లి నివాళులర్పించారు. పలు ప్రైవేట్ కార్యక్రమాలకు పొంగులేటి హాజరవ్వగా.. సన్మానించారు. కొణిజర్ల ఎంపీపీ గోసు మధు, కార్పొరేటర్ మలీదు జగన్, మైనార్టీ నాయకులు ఇమామ్, చింతమళ్ల గురుమూర్తి, మియా, చల్లా రామకృష్ణారెడ్డి, బోడా శ్రావణ్, అజ్మీరా అశోక్ నాయక్, సైదులు తదితరులు ఉన్నారు.

నియామకం

కూసుమంచి: కూసుమంచికి చెందిన బీజేపీ ఓబీసీ మోర్చా నాయకుడు గడ్డం వెంకటేశ్వర్లు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు ఆలె భాస్కర్‌రాజ్ బుధవారం నియామక పత్రాన్ని వెంకటేశ్వర్లుకు అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ..పార్టీని బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

తపాలా పథకాలను వినియోగించుకోండి


అవగాహన కల్పిస్తున్న ఉద్యోగులు

తిరుమలాయపాలెం: తపాలా శాఖ అందిస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని దమ్మాయిగూడెం బ్రాంచ్ పోస్టుమాస్టర్ బి.నవీన్‌కుమార్ తెలిపారు. బుధవారం మండలంలోని దమ్మాయిగూడెంలో ఇంటింటికి ఖాతా కార్యక్రమంలో భాగంగా ప్రజలకు అవగాహన కల్పించారు. తపాలాశాఖలో పొదుపు ఖాతాలు, వడ్డీ రేట్లు ఆకర్షణగా ఉన్నాయని, 10 ఏళ్లలోపు ఆడపిల్లలకు సుకన్య సమృద్ధియోజన పథకాలు అందుబాటులో ఉందని చెప్పారు. తక్కువ ప్రీమియంతో ఎక్కువ బోనస్ పొందే బీమా పథకాలను వినియోగించుకోవాలని కోరారు.

దేవుడా నీ సేవలకే ఆటంకమా..!

నిత్య పూజలకు నిధులు కరువు

- నెలల తరబడి ఆగిన ధూప, దీప నైవేద్యం
- భారంగా మారిన దేవాలయాల నిర్వహణ, అర్చకుల పోషణ
- అవస్థలు పడుతున్న అర్చకులు, ఉద్యోగులు


నేలకొండపల్లిలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం

ఎవరికైనా కష్టం వస్తే.. దేవుడు వద్దకు వెళ్లి గోడు చెప్పుకుంటారు. కానీ, ఆ దేవుడి సేవలు చేసేందుకు కనీస నిధులు లేకపోతే నిత్య పూజలు ఎలా చేస్తారు. నెలల తరబడి దీప, దూప నైవేద్యాలు నిలిపివేశారు. దీంతో దేవాలయాలు నిర్వహణ.. అర్చకుల పోషణ భారంగా మారింది. అర్చకులు నిత్యం దేవుడు సేవలో పరితపిస్తున్న అర్చకుల గోడు, ఆ దేవుడికు చెప్పుకునేందుకు కూడా వీలు లేకుండా దేవాలయాల నిర్వహణకు నిధులు నిలిపివేశారు. దీంతో ఏం చేయాలో తెలియక అష్టకష్టాలు పడాల్సి వస్తోంది.

నేలకొండపల్లి: పాలేరు నియోజకవర్గంలోని ఆలయాలకు ధూప, దీప నైవేద్య పథకం కింద ఇస్తున్న నిధులు గత నాలుగు నెలలుగా నిలిచిపోయాయి. దీంతో ఆయా ఆలయాల పూజారులు నిత్య పూజలు చేయడానికి నానా అవస్థలు పడుతున్నారు. ఎలాంటి ఆదాయం లేని గుళ్లకు వచ్చే భక్తుల మనోభావాలను దెబ్బతినకుండా కనీసం, నిత్య పూజలైనా జరిగేలా చూడాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించి ఈ పథకం ప్రవేశపెట్టింది. కోవెలలో కమిటీల సహకారంతో కొన్ని చోట్ల నిత్య పూజలు నిర్వహిస్తున్నా.. పూజారులకు గౌరవ వేతనం సమకూరకపోవటంతో వారు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా మారుమూల గ్రామాల్లో ఈ పథకాన్ని వర్తింపజేస్తున్న ఆలయాలకు నిత్య కైంకర్యాలు కరవుతున్నాయి. నిధులు సమకూరని పరిస్థితుల్లో ఆలయ నిర్వహణ కమిటీలు సైతం సహకరించని ఆలయాల్లో ధూప, దీప, నైవేద్యాలను సమర్పించటం అర్చకులకు తలకు మించిన భారంగా మారింది.

ఇచ్చేదే అంతంత.. ఆపై పెండింగ్..

ధూప, దీప నైవేద్యం కింద దేవాదాయ శాఖ పరిధిలో పాలేరు డివిజన్‌లో దాదాపు 50 వరకు ఉన్నాయి. ఈ పథకం కింద నెలకు రూ.6 వేలను అందిస్తున్నారు. ఇందులో రూ.2 వేలు ధూప, దీప నేవైద్యాలకు, రూ.4 వేల అర్చకులు వేతనాలుగా నిర్ణయించారు. పాలేరు డివిజన్‌లో దాదాపు చాలా వరకు ఆలయాలకు ఆదాయం లేనివే ఎక్కువగా ఉన్నాయి. ఇచ్చేవి అరకొరగా ఉండగా.. అవి కూడా నెలల తరబడి పెండింగ్‌లో ఉంటున్నాయి. ఏం చేయాలో అర్థంకాక అర్చకులు ఆవేదనకు గురవుతున్నారు. అందినకాడికల్లా అప్పులు తెచ్చి ఆలయాల నిర్వహణను చూస్తున్నారు. పూజలకు అవసరమైన సామగ్రి ధరలు పెరిగిన దృష్ట్యా.. సమకూరుతున్న డబ్బుతో కైంకర్యాలు నిర్వహించటం ఒకింత కష్టంగా మారిందని అర్చకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రతి నెలా ఇవ్వాల్సిన డబ్బులను నిలిపివేయటంతో దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నామని అర్చకులు, భక్తులు పేర్కొంటున్నారు.

సర్దుకుపోతున్నాం..



ఆలయానికి ప్రతి నెలా వచ్చే రూ.6 వేలతో నిర్వహణ చాలా కష్టం. గౌరవ వేతనం రాక ఇబ్బందులు పడుతున్నా.. ఉన్న వాటిలోనే సర్దుకుంటున్నాం. నెలల తరబడి నిలిపివేస్తే వేతనాలపైనే ఆధారపడి జీవించే వారి పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. వెంటనే నిధులు అందించే ఏర్పాట్లు చేయాలి.

– పంతంగి పవన్‌కుమార్ శర్మ, అర్చకుడు, కొత్తకొత్తూరు

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం..



ధూప, దీప నైవేద్యాల కింద ప్రతి నెలా చెల్లింపులు నిలిచిన మాట వాస్తవమే. ఈ సమస్య గురించి జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ప్రభుత్వం త్వరలోనే సమస్యను పరిష్కరిస్తుందని అధికారులు చెబుతున్నారు. కైంకార్యాలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం.

– పి.నారాయణచార్యులు, ఉద్యోగి, దేవాదాయ శాఖ, నేలకొండపల్లి

నిధులు ఇవ్వకుంటే నిర్వహణ ఎలా..?



ప్రభుత్వం అన్నింటిలోనూ ఇదే పరిస్థితి తీసుకొస్తుంది. దేవాలయాలకు ఇచ్చే కొద్దిపాటి నిధులు కూడా ఇవ్వకుంటే ఎలా. భక్తుల మనోభావాలను దెబ్బతీయకుండా వెంటనే ధూప, దీప నైవేద్యాలకు నిధులు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– నున్నా రవికుమార్, భక్తుడు, మోటాపురం

మౌలానా అబుల్ కలాం ఆజాద్ వర్ధంతి

స్వాతంత్ర్య సమరయోధుడు, తొలి విద్యాశాఖ మంత్రి అబుల్ కలాం ఆజాద్ 65వ వర్ధంతి వేడుకలను బుధవారం పలు పార్టీల నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అబుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఆయన పార్టీకి, దేశానికి చేసిన సేవలను పలువురు కొనియాడారు. – సాక్షి నెట్‌వర్క్



ఖమ్మంమయూరిసెంటర్: మంత్రి పువ్వాడ క్యాంపు కార్యాలయంలో బీఆర్‌ఎస్ నాయకులు


ఖమ్మం సహకారనగర్: పార్టీ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

'సమస్యలకు నిలయాలుగా గురుకులాలు'

రఘునాథపాలెం: జిల్లాలోని గురుకుల పాఠశాలలు సమస్యలు నిలయాలుగా మారాయని.. ఇకనైనా అధికారులు సమస్యలను పరిష్కరించి విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందేలా పర్యవేక్షించాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. రఘునాథపాలెంలోని బీసీ సంక్షేమ వసతి గృహం, మైనార్టీ వసతి గృహాలను బుధవారం సందర్శించిన వారు విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ.. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం పెట్టకపోగా.. గత రెండు నెలలుగా కోడి గుడ్డు కూడా ఇవ్వడం లేదని, కనీసం టాయిలెట్లు కూడా సరిగ్గా లేక అవస్థ పడుతున్నారని తెలిపారు. ఇకనైనా సమస్యల పరిష్కారంపై అధికారులు దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. పీడీఎస్‌యూ నాయకులు వడ్లమూడి సతీష్, సతీష్, లక్ష్మణ్, రవితేజ, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ధ్యేయం

ఖమ్మంఅర్బన్: రైతు సంక్షేమమే ధ్యేయంగా ఆంధ్రా బ్యాంకు కర్షక సేవా సహకార సంఘం పనిచేస్తుందని సంఘం చైర్మన్ బీరెడ్డి నాగచంద్రారెడ్డి పేర్కొన్నారు. సంఘం ఆర్థిక సహకారంతో సంఘం పరిధిలో రుద్రమకోటకు చెందిన రైతు పసుపులేటి రామారావుకు మంజూరైన ట్రాక్టరును బుధవారం పంపిణీ చేసి మాట్లాడారు. సంఘం ద్వారా పంటల కొనుగోళ్లు, బంగారం తాకట్టుపై రుణాలు ఇస్తున్నట్లు తెలిపారు. సంఘం మేనేజింగ్ డైరెక్టర్ సాకేత్‌కుమార్, సీఈఓ అశోక్, సిబ్బంది శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

క్యాలెండర్లు ఆవిష్కరణ

ఖమ్మం మామిళ్లగూడెం: తెలంగాణ రాష్ట్ర పెరిక కుల సంఘం నూతన సంవత్సర క్యాలెండర్లను బుధవారం ఖమ్మంలోని వర్తక సంఘ భవనంలో రాష్ట్ర అధ్యక్షుడు లక్కరసు ప్రభాకర్‌వర్మ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దనియాకుల కృష్ణ, నిజామాబాద్ అధ్యక్షుడు సుధాకర్, ఆర్థిక కార్యదర్శి నట్టి మోహన్, ఖమ్మం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బందు సూర్యం, గజ్జవెల్లి సత్యనారాయణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు పాయల నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో కవలల దినోత్సవం


హార్వెస్ట్‌లో కవలలతో కరస్పాండెంట్, ప్రిన్సిపాల్


న్యూ విజన్ పాఠశాలలో కవలలతో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు


విన్‌ఫీల్డ్ పాఠశాలలో..

ఖమ్మం సహకారనగర్: నగరంలోని పలు ప్రైవేట్ పాఠశాలలో బుధవారం అంతర్జాతీయ కవలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా హార్వెస్ట్ పాఠశాల కరస్పాండెంట్ పి.రవిమారుత్ మాట్లాడుతూ తమ పాఠశాలలో 40మంది కవలలు ఉన్నారన్నారు. ప్రిన్సిపాల్ పార్వతిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే, న్యూవిజన్ పాఠశాలలో నిర్వహించిన కవలల దినోత్సవంలో ప్రిన్సిపాల్ అబాద్ అలీ, ఉపాధ్యాయులు పాల్గొని మాట్లాడారు. విన్‌ఫీల్డ్ పాఠశాలలో నిర్వహించిన వేడుకలలో పాఠశాల యాజమాన్యం గద్దె పుల్లారావు, పోలవరపు శ్రీకాంత్, మన్నె కిషోర్‌కుమార్ పాల్గొన్నారు.

'ఎమ్మెల్యే సాయన్నను అవమానించిన కేసీఆర్'

కూసుమంచి: కంటోన్మెంట్ ఎమ్మెల్యే సాయన్న అనారోగ్యంతో మృతిచెందగా ఆయన అంత్యక్రియలను అధికార లాంఛనాలతో నిర్వహించకుండా సీఎం కేసీఆర్ అవమానించారని బీఎస్పీ మహిళా విభాగం జిల్లా కన్వీనర్ ఉప్పల మంజుల అన్నారు. బుధవారం కూసుమంచిలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఐదు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై ప్రజలకు సేవలు అందించిన సాయన్న శాసన సభ్యుడిగా ఉండగానే మృతిచెందినప్పటికీ.. దళితుడనే ఉద్దేశంతో అంతిమ సంస్కారాల విషయంలో కేసీఆర్ వివక్ష చూపించారని విమర్శించారు. ఆత్మగౌరవం గల దళిత ప్రజాప్రతినిధులు, ఆదిపత్యాకులు పార్టీ నుంచి బయటకు రావాలని కోరారు. ఈ సమావేశంలో పాలేరు అసెంబ్లీ ఇన్‌చార్జ్ బి.ఉపేందర్, మండల అధ్యక్షుడు దుంపల సాయిచరణ్, నాయకులు శ్రీకాంత్, కనకరావు తదితరులు పాల్గొన్నారు.

మోదీ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి


మాట్లాడుతున్న వీరభద్ర ప్రసాద్

ఖమ్మం మామిళ్లగూడెం: కేంద్రంలో మోదీ ప్రవేశపెట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి వీరభద్రప్రసాద్ కోరారు. బుధవారం రాత్రి స్థానిక 26వ డివిజన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ తెలంగాణలో అమలు చేయకపోవటం విచారకరమన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు గెంటెల విద్యాసాగర్, జిల్లా ప్రధాన కార్యదర్శి రుద్రప్రదీప్, ఉపాధ్యక్షురాలు మంద సరస్వతి, వెంకట్, బోయినపల్లి చంద్రశేఖర్, డీకొండ శ్యామ్, శేషు, డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలో కుక్కలు, కోతుల బెడద ఎక్కువైందని, ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే భయాందోళన చెందుతున్నారని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మహమ్మద్ సలాం అన్నారు. బుధవారం ప్రజల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మేయర్ పునుకొల్లు నీరజ, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభిలకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సలాం మాట్లాడుతూ.. రోజురోజుకు పెరుగుతున్న కుక్కల సమస్యలతో పాటు వేసవి కాలం దృష్ట్యా మంచినీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర సహాయ కార్యదర్శి యానాల సాంబశివరెడ్డి, నూనె శశిధర్, ఎస్‌కె.సైదా, నిజాంపేట్ యాకూబ్, ఎండీ రెహమాన్, ఎస్‌కె. ఖాన, డి.సురేష్ నాయక్, ఎం.రవి, భద్రం, వల్లపు నాగేశ్వరరావు, సలీం పాల్గొన్నారు.

ఈడీ దాడులతో ప్రజా సమస్యలు పక్కదారి


ప్రజలతో మాట్లాడుతున్న దుర్గాప్రసాద్, రాయల

నేలకొండపల్లి: ఈడీ, ఐటీ దాడులతో ప్రజా సమస్యలను పాలకులు పక్కదారి పట్టిస్తున్నారని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ ఆరోపించారు. మండలంలోని బైరవునిపల్లిలో బుధవారం రాత్రి హాథ్ సే హాథ్ జోడో యాత్రను నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. మిషన్ భగీరథ, చెరువుల పూడికతీతలో ప్రభుత్వం అక్రమాలకు పాల్పడిందని పేర్కొన్నారు. రాజకీయాలు, ఎన్నికల ప్రయోజనాలకు అతీతంగా యాత్రను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పెంచిన ధరలను తగ్గించాలంటే బీజేపీ, బీఆర్‌ఎస్‌లను ఓడించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు రాయల నాగేశ్వరరావు, మండల నాయకులు బచ్చలకూరి నాగరాజు, జెర్రిపోతుల అంజిని, జీజీ.శ్రీనివాసరావు, ముత్తయ్య, జి. ఉపేందర్, యడవల్లి నాగరాజు, పగిడికత్తుల సుదర్శన్, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణాలకు శంకుస్థాపనలు

బూడిదంపాడులో గంగమ్మగుడి నిర్మాణం..

రఘునాథపాలెం: మండలంలోని బూడిదంపాడులో గంగమ్మ గుడి నిర్మాణానికి భక్తుల సమక్షంలో బుధవారం నిర్మాణ కమిటీ సభ్యులు శంకుస్థాపన చేశారు. దాతలు సహకారంలో సుమారు రూ.20 లక్షల ఖర్చుతో గుడి నిర్మాణం చేపట్టినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లాలో యాదవ్ సంఘం నాయకులు, కార్పొరేటర్లు పగడాల నాగరాజు, పల్లెబోయిన చంద్రం, బొమ్మిడి శ్రీను, మాల్సూర్, మేకల నాగేశ్వరరావు, బూడిదంపాడు గ్రామ యాదవ సంఘం అధ్యక్షుడు మంద నాగేశ్వరావు, ఖమ్మం మార్కెట్ కమిటీ డైరెక్టర్ మంద రామకృష్ణ, కాకబోయిన నాగేశ్వరావు, శ్రీను, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

కాకరవాయిలో లింగమంతుల దేవాలయం..

తిరుమలాయపాలెం: మండలంలోని కాకరవాయి గ్రామంలో సొడమ్మ లింగమంతుల దేవాలయ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి సతీమణి విజయమ్మ బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.


రఘునాథపాలెం: శంకుస్థాపన చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

సిద్ధి వినాయక, దత్తాత్రేయ విగ్రహ ప్రతిష్ట జలాధివాసం


జలాధివాస కార్యక్రమం నిర్వహిస్తున్న భక్తులు

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని విజయనగర్‌కాలనీ శ్రీ షిర్డీ సాయిబాబా మందిరంలో నేటి నుంచి నిర్వహిస్తున్న విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాల్లో భాగంగా బుధవారం ఉదయం 5.30 గంటలకు స్థల శుద్ధి, మంగళతోరణం, యజమానుల దీక్షా ప్రదానం, శాల ప్రవేశం, శాల సంస్కారం, 11 గంటలకు జలాధివాసం కార్యక్రమాలు నిర్వహించారు. తర్వాత బాబా దర్శనం, ప్రసాద వితరణ జరిగింది. సాయంత్రం 6 గంటలకు మండ సంస్కారం, అగ్నిమదనం, అగ్నిప్రతిష్ట, ధాన్యదివాసం, అధావాసంగ వాహనము బలి హారనాథులు, రాజన్న మంత్రపుష్ప సమర్పణతో కార్యక్రమం పూర్తయింది. ఈ కార్యక్రమంలో మందిరం చైర్మన్ ఫణిభట్ల రాజలింగయ్య సిద్ధాంతి, వైస్ చైర్మన్ బుద్ధ రామకృష్ణ, సెక్రటరీ పెంట్యాల వెంకట నరసయ్య, జాయింట్ సెక్రటరీ చంద్ర వీరభద్రరావు, సభ్యులు మండెపుడి కృష్ణయ్య, దొడ్డ నరసింహారావు, భూక్యా భిక్షపతి, ఇంగువ మురళీకృష్ణశర్మ, భక్తులు పాల్గొన్నారు.

'చలో ఢిల్లీ'ని జయప్రదం చేయండి

ఖమ్మం సహకారనగర్: నూతన పెన్షన్, జాతీయ విద్యా విధానాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 24వ తేదీన తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు చావా దుర్గాభవాని, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జీవీ నాగమల్లేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వరరావులు కోరారు. స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్‌టీఎఫ్ఐ) పిలుపు మేరకు ఈ నెల 24న పార్లమెంట్ సమీపంలోని జంతరమంతర్ వద్ద జరిగే నిరసన కార్యక్రమానికి ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో తరలిరావాలని తెలిపారు.

కౌన్సిల్ సమావేశాలపై విస్తృత ప్రచారం

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మంలో మార్చి 4,5 తేదీల్లో జరిగే ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర విస్తృత కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయాలని ఆ సంఘ జాతీయ ఉపాధ్యక్షుడు రావి శివరామకృష్ణ పిలుపునిచ్చారు. వివిధ విద్యా సంస్థలు, ప్రధాన కూడళ్లలో బుధవారం వాల్ రైటింగ్ రాపిస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్య రంగ సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయన్నారు. ప్రభుత్వ విద్యారంగాన్ని పతన వ్యవస్థకు తీసుకురావాలనే ఉద్దేశంతో ప్రభుత్వాలు బడ్జెట్ కేటాయింపుల్లో అరకొర నిధులు కేటాయించారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటికాల రామకృష్ణ, జిల్లా నాయకులు చందూలాల్, సాయి, నరేష్, గౌతమ్, మధు, వెంకటేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు' ప్రారంభం

తిరుమలాయపాలెం/రఘునాథపాలెం: తిరుమలాయపాలెం మండలంలోని కొక్కిరేణిలో బుధవారం ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ఎంపీపీ మంగీలాల్, జెడ్పీటీసీ బెల్లం శ్రీనివాస్ ప్రారంభించారు. అలాగే, రఘునాథపాలెం మండలంలోని వేపకుంట్ల పాఠశాలలో సర్పంచ్ ధారా శ్యాం ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడారు. కొక్కిరేణిలో ఎంపీడీఓ జయరాం, ఎంపీఓ రాజేశ్వరి, పీహెచ్‌సీ వైద్యుడు రామారావు, సర్పంచ్ గంటా నిర్మల, ఎంపీటీసీ గుగ్గిళ్ల అంబేద్కర్ పాల్గొనగా.. వేపకుంట్లలో కార్యక్రమంలో ఎంపీడీఓ రామకృష్ణ, డాక్టర్ సాహితి నజీయా, హెల్త్ అసిస్టెంట్ పుష్పావతి, కృష్ణయ్య, లక్ష్మి క్రాంతి, గ్రామ సెక్రటరీ సుజాత, మాజీ జెడ్పీటీసీ కుర్రా భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటాలు

నేలకొండపల్లి: ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటాలు సాగిస్తున్నామని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా పాలేరు డివిజన్ కార్యదర్శి సి.వై.పుల్లయ్య పేర్కొన్నారు. మండలంలోని సదాశివాపురంలో నిర్వహించిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలను చైతన్యం చేసి, దోపిడికి వ్యతిరేకంగా ఉద్యమిస్తూ..పేదల రాజ్యస్థాపన కోసం నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఇష్టా పాలేరు ఏరియా కార్యదర్శి పగిడికత్తుల రామదాసు, పగిడికత్తుల నాగేశ్వరరావు, గూడెల్లి వెంకన్న, చిర్రా భిక్షం, సత్తి, కొమ్ము రాములు, చిర్రా నాగులు, యండ్రాతి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

'త్రివేణి'లో సైన్స్ ఉత్సవం


ప్రదర్శనలను తిలకిస్తున్న దృశ్యం

ఖమ్మం సహకారనగర్: నగరంలోని త్రివేణి పాఠశాలలో సైన్స్ ఉత్సవం 2023 కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించినట్లు పాఠశాల డైరెక్టర్ గొల్లపుడి వీరేంద్రచౌదరి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీసేందుకు గాను సైన్స్ ఉత్సవం కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. తొలుత నేషనల్ చిల్డ్రన్స్ సైన్స్ కాంగ్రెస్ జిల్లా కో ఆర్డినేటర్ ఈ.వెంకటేశ్వర్లు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించగా.. విద్యార్థులు చేసిన ప్రదర్శనలు అందరిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి.రాజేంద్రప్రసాద్, త్రివేణి, కృష్ణవేణి విద్యాసంస్థల డైరెక్టర్ వెంకటేశ్వరరావు, ఇన్‌చార్జ్‌లు పాల్గొన్నారు.

ఎంఈఓకు వినతి

ఖమ్మం సహకారనగర్: నగరంలో అనుమతి లేకుండా నడుస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఖమ్మం అర్బన్ ఎంఈఓ శ్రీనివాస్‌కు పీడీఎస్‌యూ నాయకులు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో నాయకులు మస్తాన్, గోపి, ఉదయ్ పాల్గొన్నారు.

సమసమాజ స్థాపనే ప్రజాపంథా లక్ష్యం


కామేపల్లిలో జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

సమసమాజ స్థాపనే సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా లక్ష్యమని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా నాయకులు తెలిపారు. బుధవారం మండల కేంద్రాల్లోని పార్టీ కార్యాలయాలు, ప్రధాన సెంటర్లపార్టీ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు జెండా ఆవిష్కరించి మాట్లాడారు. ప్రజా ఉద్యమాల ద్వారానే సమస్యలు పరిష్కారమవుతాయని పలువురు పేర్కొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్